క్లుప్తంగా

కోరుకొండపాలెంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


గ్రామంలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండపాలెం గ్రామంలో విజయనగరం ఎంఆర్ అటానమస్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా డాక్టర్ పీవీజీ రాజు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోని కృష్ణ సమక్షంలో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు గ్రామంలో 40 మొక్కలను నాటారు. పోషన్ అభియాన్‌పై గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఉన్న యువతకు వాలీబాల్ పోటీలు, మండల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ సిబ్బంది హైమావతి, రమ్య, లక్ష్మి, ఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు, మాన్సాస్ కరస్పాండెంట్ కేవీఎల్ రాజు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు జి.చంద్రశేఖర్, డాక్టర్ పీఎస్‌వి శర్మ, సీహెచ్ చిన్నంనాయుడు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి'

పూసపాటిరేగ : ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సచివాలయంలో సచివాలయం సిబ్బంది, వలంటర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 9 నుంచి జరగబోయే కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించాలన్నారు. డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. 9వ తేదీన పూసపాటిరేగ -1 సచివాలయం, 10న పూసపాటిరేగ -2 సచివాలయం, 14న కుమిలి-1, 15న కుమిలి-2, 16న రెల్లవలస, 17న చల్లవానితోట, 20న పేరాపురం, 21న సిహెచ్.అగ్రహారం, 22న కొప్పెర్ల, 23న కనిమెల్ల గ్రామాలలో జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరగనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, టొంపల సీతారాం, మహంతి లక్ష్మణరావు, కార్యదర్శి వెంకటరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

విజయనగరం రూరల్: రాష్ట్ర స్థాయి ఖో- ఖో పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన జొన్నవలస జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను విజయనగరం జెడ్పీటీసీ సభ్యులు కెల్ల శ్రీనివాసరావు అభినందించారు. ఈ నెల 6న గరివిడి మండలం కోనూరులో జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో అండర్- 14 విభాగంలో డి.యుగంధర్, కె.హేమంత్, ఆర్.సిరి, ఎ.తులసి, ఎం.పూర్ణిమ ఎంపిక కాగా అండర్-17 విభాగంలో బి.ఉదయ్‌శ్రీ, కె.అంజలి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.విజయలక్ష్మి తెలిపారు.


విద్యా సంస్థల బంద్ సక్సెస్

నెల్లిమర్ల: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న భారీ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలని మోదీ ప్రభుత్వం చూస్తుందని దీన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. బంద్‌ను విజయవంతం చేసిన విద్యా సంస్థల యాజమాన్యాలకు ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బాలాజీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఆపాలి'

దెంకాడ: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో తెచ్చుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవికుమార్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బంద్ పాటించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపడంతో పాటు విభజన హామీలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ పెనుమత్స


శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు బుధవారం దర్శించుకున్నారు. స్థానిక నాయకులతో కలిసి తిరుపతి వెళ్లిన ఆయన వీఐపీ బ్రేక్ దర్శనంలో స్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్సీ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

నగర సంపూర్ణ అభివృద్ధే ధ్యేయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని 29వ డివిజన్‌లో రూ.49 అభివృద్ధి పనులకు శ్రీకారం


పార్కును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సమస్యలు లేని నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దటమే తమ ధ్యేయమని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. నగరంలోని 29వ డివిజన్‌లో రూ.49 లక్షలతో తలపెట్టిన అభివృద్ధి పనులకు బుధవారం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిలతో కలిసి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రూ.29 లక్షలతో డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం రూ.20 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. పార్కులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, సేదదీరేందుకు బెంచీలను, పిల్లల కోసం క్రీడా పరికరాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ నగరం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా పయనించేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తుంటే, నగరంలో అభివృద్ధి దిశగా అనేక చర్యలను చేపడుతున్నారన్నారు. ప్రధాన జంక్షన్లతో అభివృద్ధితో పాటు రహదారులను విస్తరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలను కల్పిస్తూ సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దాలన్నదే ఆయన ఆశయమని పునరుద్ఘాటించారు. 29వ డివిజన్‌లో ఇప్పటికే రూ.4 కోట్లకు పైగా వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత కోలగట్లకే దక్కుతుందన్నారు. మెయిన్ రోడ్డుకు అనుకొని ఉన్న పార్కు ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిగా... ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్ర స్వామి గెలిపించినట్లయితే నగరం మరింత అభివృద్ధి దిశగా పయనిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్, డివిజన్ ఇన్‌చార్జి కోలగట్ల కృష్ణారావు, యువజన విభాగం నాయకుడు గుణశేఖర్, అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాల్సిందే...

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీరాములనాయుడు, ఇంజినీరింగ్ అధికారులు

విజయనగరం: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాన్ని సహించబోమని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో సహాయకుల పర్యవేక్షణ కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పూర్తయిన అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎస్పీ బంగ్లా రహదారి ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతంతో పాటు నిర్మాణ నాణ్యత కూడా ముఖ్యమైనదని కాంట్రాక్టర్లు గ్రహించాలన్నారు. పని పూర్తయ్యేంత వరకు క్షేత్ర స్థాయిలో పరిశీలకులను నియమించాలని చెప్పారు. తాము చేపట్టే ఆకస్మిక తనిఖీలలో నాణ్యత లోపాలను, విధానపరమైన లోపాలనుగాని సహించబోమని హెచ్చరించారు. ఇన్‌చార్జి ఈఈ దక్షిణామూర్తి, డీఈలు పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నగరంలోని 46వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం


46వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

విజయనగరం: గడప గడపలో సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పాలన సాగిస్తుందని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి కోలగట్ల తమ్మన్నశెట్టి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 46వ డివిజన్ కనపాకలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి వెళ్లి గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాల వివరాలను వెల్లడించారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. స్థానిక సమస్యలపై ఆరా తీసి అవసరమైన చర్యలు తీసుకోవాలని అక్కడున్న సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల తీరు ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగా తమ డివిజన్‌లో ఇంటింటికి వెళ్తుంటే ప్రజల స్పందన అనూహ్యంగా లభిస్తుందన్నారు. డివిజన్ అధ్యక్షుడు కనిమెరక తవుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తుంటే స్థానికంగా కోలగట్ల వీరభద్ర స్వామి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి తమ్ము, నాయకులు బొద్దూరు లక్ష్మణరావు, మహిళా అధ్యక్షురాలు పడగల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


ప్రభుత్వం ద్వారా అందిన పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ప్రజా సాధికారత లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సవరవిల్లి పంచాయతీ పరిధిలో రెండో రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే, నవరత్నాలు మీ ఇంటికి రావాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని బడ్డుకొండ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గతంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సు ఉండాలని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వం అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలను ఎలా కత్తిరించాలా.. అనే ఆలోచనతో పరిపాలన చేయగా నేడు జగనన్న ప్రభుత్వం అర్హులను వెతికి మరీ లబ్ధి చేకూర్చుతోందన్నారు. పారదర్శక పాలన అంటే ఇదే అని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామన్నారు. గత పాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న తేడాను గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలకు 175 సీట్లు వైఎస్సార్‌సీపీ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పట్నా తాతయ్యలు, పడాల భానుప్రకాశ్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్ కొల్లు రామ్మూర్తి, కిలారి వెంకటరమణ, అప్పనభుక్త పైడినాయుడు, ఎంపీడీఓ అప్పలనాయుడు, తహసీల్దార్ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వరి రైతులను ఆదుకోవాలి

నెల్లిమర్ల: వరి సాగు చేస్తున్న రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలో తెగుళ్ల సోకిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వర్షాభావ పరిస్థితుల్లో వరి పంటకు తెగుళ్ల సోకి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.

ఎన్టీఆర్ అభిమాని కుటుంబానికి ఆర్థిక సాయం

దాబాగార్డెన్స్ : ఇటీవల మృతి చెందిన ఏపీ, తెలంగాణ స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ విజయనగరం జిల్లా కన్వీనర్ పిన్నింటి కృష్ణ యాదవ్ కుటుంబానికి స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్లు ఆర్థిక సాయం అందజేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పిన్నింటి కృష్ణ యాదవ్ కుటుంబ సభ్యులకు కన్వీనర్లు సేకరించిన రూ.4 లక్షల 25 వేల మొత్తాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ వైడ్ కన్వీనర్ నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ అభిమానులకు ఎల్లప్పుడూ తమ హీరో ఎన్టీఆర్ అండదండలు ఉంటాయన్నారు. అలాగే గతంలో మృతి చెందిన శ్రీకాకుళం కన్వీనర్ మన్మథరావు కుటుంబానికి కూడా చేయూత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్లు

గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వామపక్ష పార్టీల నేతలు తమ్మినేని సూర్యనారాయణ, రంగరాజు ఖండించారు. ప్రపంచ శాంతిని నెలకొల్పాలంటూ ఈ దాడులకు వ్యతిరేకంగా నవంబర్ 10వ తేదీన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. బుధవారం ఎల్బీజీ భవనంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అమెరికా తన ఆధిపత్యం కోసం, ఆయిల్ చమురు కోసం పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాల మధ్య జాత్యహంకార చిచ్చులు రేపి యుద్ధానికి ఆద్యం పోసిందని విమర్శించారు. చిన్నపిల్లలను, మహిళలను విడిచి పెట్టకుండా శరణార్థ శిబిరాల వద్ద కూడా బాంబులు వర్షం కురిపించి ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమైందని వెల్లడించారు. ఈ విషయంలో ప్రపంచ దేశాలన్నీ ఖండిస్తుంటే దేశ ప్రధాని మోదీ మాత్రం నోరు విప్పటం లేదని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి., టీవీ రమణ, ఆర్.శంకర్‌రావు పాల్గొన్నారు.

'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపు


మాటాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు గురువారం నుంచి మండలంలోని వివిధ సచివాలయాల్లో నిర్వహించనున్న ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని సవరవిల్లి సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి ఈ నెల 23 వరకు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లేందుకు ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి అనే బృహత్తర కార్యక్రమం నిర్వహించడానికి నాయకులు ఉత్సాహంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలు, మండలాలు, పంచాయతీల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి విశాఖపట్నాన్ని రాజధానిగా చేయడం జరుగుతుందన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వం రైతులకు పూర్తి నష్ట పరిహారం చెల్లించకుండా భూములు తీసుకునే పరిస్థితి ఉండేదని, మన ప్రభుత్వం వచ్చాక అందరికీ పూర్తి పరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. 36 నెలల్లో విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేసేలా జీఎంఆర్ సంస్థకు పనులు అప్పగించడం జరిగిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల శ్రీనివాసరావు, అప్పురభుక్త పైడినాయుడు, కొల్లు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దెంకాడలో...

దెంకాడ: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం దెంకాడలో జరుగుతుందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు బుధవారం తెలిపారు. దీనిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు తదితర వాటిని వివరించడం జరుగుతుందని చెప్పారు.


విజయనగరం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరంలో..

విజయనగరం రూరల్: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం నుంచి నిర్వహించనున్న 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు కోరారు. విజయనగరం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామ సచివాలయం పరిదిలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభించి, రెండో రోజు ఉదయం వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వర్ కౌశిక్ జన్మదిన వేడుకలు


వృద్ధాశ్రమానికి ఫ్రిజ్ అందజేస్తున్న ఈశ్వర్‌కౌశిక్, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి దంపతులు

విజయనగరం: జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్ కౌశిక్ జన్మదిన వేడుకలు బుధవారం నగరంలో ఘనంగా జరిగాయి. 29వ డివిజన్‌లోని పార్కులో అభిమానుల నడుమ తొలిత ఈశ్వర్ కౌశిక్ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టగా.... డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్ దంపతులకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి పలువురు అభినందనలు తెలిపారు. అనంతరం కుసుమహరనాథ్ క్షేత్రంలోని వృద్ధాశ్రమానికి కౌశిక్ దంపతులు ఉచితంగా ఫ్రిజ్ అందజేశారు. ఫూల్‌బాగ్ మంగళ వీధిలో ఉన్న అంధుల పాఠశాలకు ఇన్వర్టర్‌ను, ఫూల్‌బాగ్‌లో గల ద్వారకామయి అంధుల పాఠశాలకు ఫ్యాన్లను అందజేశారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు భూరి విరాళాన్ని అందజేశారు. పైడితల్లమ్మ దేవస్థానం కల్యాణ మండపంలో అన్నదానాన్ని నిర్వహించారు. పేర్ల వారి వీధిలో ఉన్న బధిర పాఠశాలకు ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లను అందజేసారు. ద్వారపూడిలో ఉన్న వృద్ధాశ్రమానికి టీవీ అందజేశారు. అగ్నిమాపక కేంద్రానికి ఎదురుగా ఉన్న పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఖాదర్ బాబా ఆశ్రమంలో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. కార్పొరేటర్లు బండారు ఆనందరావు, అల్లు చాణిక్య, పార్టీ నాయకులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రసాద్


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ప్రసాద్

నెల్లిమర్ల: ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 9 నియోజకవర్గాల పరిధిలో అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీలు మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న(మంగళవారం) జరిగాయి. ఈ పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి పి.ప్రసాద్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. చిత్తూరు జిల్లా తిరుపతిలో డిసెంబరు మొదటి వారంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ప్రసాద్ అక్కడ పోటీల్లో పాల్గొననున్నాడు. విద్యార్థిని పాఠశాల హెచ్ఎం కె.సూర్యనారాయణ, పీడీ వి.రామచంద్రుడు, బిజాన్సన్, ఇతర సిబ్బంది అభినందించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలకు స్పందన

విజయనగరం: నగరంలోని 41వ నంబరు సచివాలయంలో, ఆది ఆంధ్ర పాఠశాలలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజా స్పందన లభించింది.

ప్రజలు ఆరోగ్య శిబిరాలకు హాజరై ప్రాథమిక పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాల నిర్వహణను స్థానిక కార్పొరేటర్‌లతో పాటు కార్పొరేటర్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నగరంలో 49 సచివాలయాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పూర్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా 16,529 మందికి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేపట్టినట్లు తెలిపారు. వీరిలో 312 మంది శస్త్ర చికిత్సలకు రిఫర్ చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలి ప్రతాప్, ఆయా డివిజన్‌లలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక విజయనగరం

- చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సిరిసహస్ర

విజయనగరం: మత సామరస్యం విషయంలో ప్రపంచానికే విజయనగరం జిల్లా ఆదర్శవంతంగా నిలుస్తుందని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర పేర్కొన్నారు. విజయనగరంలో నివసిస్తున్న హిందువులు, ముస్లింలు బాయీ బాయి అంటూ స్నేహ పూర్వకంగా జీవించడమే ఇందుకు తార్కాణంగా నిలుస్తుందన్నారు. బుధవారం నగరంలోని బాబామెట్టలో గల ఖాదర్‌బాబా దర్గాను సందర్శించిన ఆమె ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం నిర్వాహకులు ఖలీల్ ఉల్లా షరీఫ్ నేతృత్వంలో నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. దర్గా ఆవరణలో గల ఏటీకే వృద్ధాశ్రమన్ని సందర్శించి వృద్ధులకు ఫ్రిజ్, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హతా వుల్లా బాబా మత సామరస్యానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, జాకీరు హుస్సేన్, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లపై తస్మాత్...


నెల్లిమర్ల: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని భోగాపురం సీఐ బివి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నగర పంచాయతీకి చెందిన మంచుపల్లి బాలమణి ఎస్‌బీఐ ఖాతా నుంచి తన ప్రమేయం లేకుండా, తనకు తెలియకుండా ఎవరోగుర్తు తెలియని సైబర్ నేరగాళ్లు రూ.2 లక్షలు దొంగలించడంతో తనకు న్యాయం చేయాలని గత నెల 18న నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసును చేధించి ప్రథమ ముద్దాయి అయినటువంటి పండిటి క్రాంతికుమార్‌ను అనంతపురం పట్టణంలో పట్టుకున్నామన్నారు. బాధితులు పోగొట్టుకున్న డబ్బును తిరిగి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి ముద్దాయిని పట్టుకోవడంలో సహకరించిన నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.మోహన్‌రావు, కానిస్టేబుల్ పి దామోదర్‌రావులను అభినందించారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఐ బాలకృష్ణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

హమాలీల సమస్యల పరిష్కారంలో అధికారుల విఫలం

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య

విజయనగరం ఫూల్‌బాగ్ : సివిల్ సప్లై హమాలీల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకట సుబ్బయ్య ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా స్థాయి సమావేశం ముల్లు నర్సింహులు అధ్యక్షతన అమర్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు. కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సివిల్ సప్లై కార్మికుల సమస్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, ఆయా సమస్యలు పరిష్కరించడంలో జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో పోరాటాలు ద్వారా సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. ఇందుకు రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. డిసెంబర్ నెలలో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బెల్లాన సత్యన్నారాయణ, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం


గ్రామంలో ఇంటింటి వెళ్ల సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, గ్రామ ప్రజాప్రతినిధులు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా నిలిచిందని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడులు అన్నారు. మండలంలోని పడాలపేట గ్రామ పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం నుంచి మంజూరైన సంక్షేమ పథకాలను, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలు అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శశి భార్గవి, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీను, గ్రామ సర్పంచు సువ్వాడ శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు నడిమింటి తులసి, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.